# కొత్త నక్షత్రం

సుజాత బద్ధకంగా ఆవలించింది. ఇంకా పక్కమీదనుంచి లేవలేదు. టైము చూచింది. అప్పడే ఎనిమిదిగంటలయింది. ఇదివరకటి రోజులయితే, యీపాటికి తాను బస్సుకోసం పరుగెత్తేటైము. అంటే ఉదయం ఏడున్నర, ఏడుంముప్పావుకల్లా తన ఉదయ కార్యకలాపాలన్నీ పూర్తిచేసుకుని ఆఫీసుకు వెళ్ళటానికి తయారయ్యేదన్నమాట. ఎటొచ్చీ యీ రెండు వారాలుగానే తనకు నిద్ర మంచంమీదనుంచి లేవడం కాస్త ఆలస్యం అవుతుంది.

తను యింకా నిద్రలేవకముందే ఆయన స్నానం అదీ పూర్తిచేసి ముందుగదిలోకి వెళ్ళిపోతున్నారు. చెప్పాకుంటే సిగ్గుచేటు ఆయనే కాఫీ తయారుచేసి తను తాగి, తనకోసం ఫ్లాస్కులోపోసి మూతవేస్తున్నారు. ముందుగదిలోకి వెళ్ళిపోవటానికి ముందు తనను కాస్త లేపినట్లుగాచేసి "నేను ఆఫీసు గదిలోకి వెడుతున్నాను. నీకాఫీ ఫ్లాస్కులో సిద్ధంగా వుంది. లేవగానే తాగేసెయి' అని చెప్పేస్తున్నారు. అప్పుడుగాని తనకు మంచం మీదనుంచి లేవాలని అనిపించదు.

ఎటొచ్చీ యీ నెల రోజులనుంచీ తను యింత విశ్రాంతిగా తీరుబాటుగా వుంటూంది. అంతకుముందు—అంటే తన పెళ్ళి కాకముందు-సుజాతకు ఒక్క క్షణం తీరుబడిలేదు. అమ్మతోపాటు ఉదయమే యింకా సూర్యుడు రాకముందే లేచేది. తన స్వంత పనులన్నీ పూర్తిచేసుకుని, అమ్మకు కాఫీ టిఫిన్లు తయారు చేయడంలో సాయపడేది. ఎనిమిది గంటలకల్లా తను కూడా రెండుముద్దలు తినేసి-ఆరు అవున్సుల కాఫీ గొంతులో పోసుకుని బస్సుకోసం పరిగెత్తేది. అవును. అక్షరాల పరుగెత్తేది, బస్సుమీద ఆధారపడిన వాళ్ళెవరూ తను పనులు విశ్రాంతిగా తీరుబాటుగా చేసుకుందుకులేదు. ఆ బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు పోతాయో-ఎక్కడ నిలుస్తాయో ఎవరూ యిదమిత్థంగా చెప్పలేరు. సాధ్యమయినంత

ముందుగా వెళ్ళి బస్‌స్టాప్ అనబడే చోట నిలబడివుండాలి. కండక్టరు డ్రయివర్లకు దయ తప్పకపోతే ఆ బస్సు ఠంచనుగా యేదో టైముకు అక్కడికి వస్తుంది. దాంట్లో కూచుంటేనే యిరవయి నిమిషాల్లో ఆఫీసు దగ్గర స్టాప్‌కు తీసుకెడుతుంది. అక్కడినుంచి ఆఫీసు దగ్గరకు అయిదు నిమిషాల నడక-అంతా తను ఆఫీసు చేరుకునేసరికి ఎనిమిదిన్నర అయిపోతూ ఉంటుంది.

ఆఫీసు ఎనిమిదన్నరకే అయినా-అంతకుముందే సాధ్యమయినంత తొందరగావచ్చి కూచుంటాడు, తన ఆఫీసరు. ఇంకానయం అందరినీ అలా రమ్మని ప్రాణం తీసేవాడుకాదు. అయితే ఎనిమిదిముప్పావు తరువాత వచ్చేవాళ్ళ విషయంలో మటుకు కాస్త నిర్మొగమాటంగా నిక్కచ్చిగా వుండేవారు. బస్సులు వాటి రాకపోకల విషయంలో ప్రత్యక్షజ్ఞానం వున్నవాడు గనుక ఆయన ఒక నిమిషం రెండు నిమిషాలకు యేమీ అనేవాడుకాదు. అయినా ఆలస్యంగా వచ్చినవాళ్ళు ఆయన కంటపడకుండా తప్పించుకునే వాళ్ళు ఉద్యోగుల్లో చాలాభాగం.

దయానిధి-ఆఫీసరు పేరు అది-చాలా నిక్కచ్చి అయిన మనిషి. పని విషయంలో స్వవిషయం కూడా అంతే. తనకో 'స్టాండర్డ్' యితరులకు ఒక స్టాండర్డ్ కాదు ఆయన విషయంలో. ప్రవర్తన విషయంలోను, పని విషయంలోను ఆయన అందరికీ ఉదాహరణ పూర్వకంగా వుంటారు. అందుచేతనే ఆయన 'నోటీస్'లోకి వెళ్ళటానికి అందరికీ కాస్త బెరుకుగానే ఉంటుంది.

సుజాత పూర్వపు ఆఫీసుగురించి, అక్కడ తన ఉద్యోగాన్ని గురించి నెమరు వేసుకోసాగింది.

దయానిధి, పాపం, చాలా మంచివాడు. సహృదయుడు. ఆయన దగ్గర పనిచేయడంవల్ల జీవితంలో నేర్చుకోవలసింది చాల లభిస్తుంది, తను పెళ్ళి చేసుకుని, ఉద్యోగం మానేస్తోదంటే ఆయన చాలా బాధపడ్డాడు.

'పెళ్ళిచేసుకోవడం మంచిపనే. ఆడపిల్ల ఎప్పటికయినా యిల్లూ వాకిలీ సర్దుకోవడంలో నిమగ్నురాలు అవవలసిందే. అయితే యిప్పటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా-కుటుంబంలో ఒక్క మనిషి సంపాదన ఎటూ చాలదు. అందులో మన కుటుంబాలకు కాస్తో కూస్తో యెక్కువ లావాదేవీలు, ముసలీ ముతక వ్యవహారం, పిల్లల పెళ్ళిళ్ళు పురుళ్ళూ పేరంటాలు యిటు వంటివన్నీ వుంటాయి. అందుచేత నా ఉద్దేశంలో చేతనయినవాళ్ళు ఉద్యోగం చేయడమే మంచిదంటాను ఆడపిల్లలు. ఇటు ఆఫీసు-అటు యిల్లు కాస్తకష్టం అయ్యేమాట నిజమే. కాని ఈ కష్టానికి తగిన ఫలితం లభిస్తుంది. ముందు ముందు జీవితం సుఖప్రదం అవుతుంది....' అని ఓచిన్న సైజు లెక్చర్ యిచ్చాడాయన.

సుజాతకుమాత్రం ఆఫీసంటే బాగా 'బోర్' అయిపోయింది. ఎంత సేపూ తను యంత్రంలా తయారవాలి. ప్రతిక్షణమూ యేదో కొంపలు అంటుకుపోతున్నట్లు-ఫైర్ యింజన్లకోసం ఎదురుచూస్తూ వున్నట్లు వుండాలి ఆఫీసులో.

'ఈ కాగితం అర్జెంటు—'

'ఈ ఫైలు యీరోజు వెళ్ళిపోవాలి.'

'ఈ రిజిష్టర్ ఆప్ టు డేట్ చేయాలి.'

'ఈ రిటర్న్స్ పోయిన వారమే వెళ్లవలసింది'

'ఈ అర్జీకి సమాధానం ఎందుకు పంపలేదు.'

—యిటువంటి మాటలు ప్రతిక్షణమూ చెవుల్లో పడుతూనే వుంటాయి. ఆఫీసులో వున్నంతసేపూ యేదో 'టెన్షన్'లో వుండవలసిందే తప్ప-హాయిగా ఊపిరి పీల్చుకుందుకు కుదరదు.

సుజాత ఆ ఆఫీసులో యేడు సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసింది. "స్టెనో"గా మంచి పేరు సంపాదించుకుంది,

వయసు మించిపోతుందని చెప్పి తల్లీ తండ్రీ సంబంధాలు చూడడం మొదలు పెట్టారు. ఇల్లుదాటి బయటకు వెళ్ళి యేడేళ్లు ఉద్యోగం చేయడం వల్ల సుజాతకు ప్రపంచం అంటే యేమిటో కాస్త తెలిసివచ్చింది. బొత్తిగా పెద్దవాళ్ళు తెచ్చిన మనిషిచేత మెళ్లో తాడు కట్టించుకోవడం తనవల్లకాదు. కాస్త యోగ్యుడూ-తనని యిబ్బంది సబ్బందులు లేకుండా చూచుకోగలవాడు అవసరం.

నిజానికి ఉద్యోగం చేయడం సుజాతకు యిష్టంలేదు. అయినా అంతకంటే చేసే పనేమీ లేదుగనుక యిన్నాళ్ళూ ఆ పని చేయవలసే వచ్చింది. ఒక దశలో ఉద్యోగం తప్పనిసరి అయిందికూడా. నాన్న రిటైరయిపోయి ఆయన పింఛను యెందుకూ చాలక తమ్ముళ్ల చదువులకోసం ఎక్కడిడబ్బూ చాలనప్పుడు యిల్లు గడవడం కాస్త కష్టంగా తోచింది. అప్పుడు యింటి ఖర్చులకోసం తన డబ్బు బాగ ఉపయోగపడింది. ఇప్పుడు ఆ అవసరాలన్నీ తీరినాయి తమ్ముళ్ల చదువులు పూర్తి అయినాయి. వాళ్ళంతా ఉద్యోగాలు సంపాదించుకుని దిక్కుకొకళ్ళు దేశం నాలుగు మూలలకూ వెళ్ళిపోయినారు. ఒక రకంగా చూచుకుంటే కుటుంబ అవసరాలకోసం తను ఉద్యోగం చేయడం తప్పనిసరి అయింది అప్పుడు. తన సంపాదన వల్లనే కాస్తో కూస్తో ఆ కుటుంబం ఎడతెరిపిలేని ఖర్చులనుంచి తప్పుకుని నిలదొక్కుకోగలిగింది. ఆ కుటుంబపు అవసరాలన్నీ తీరిపోయిన తర్వాతనే తన పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చారన్నమాట-తల్లీ తండ్రిని. తన వివాహానికి తమ్ముళ్లంతా సంపాదన పోగుచేసి డబ్బు ఖర్చుపెట్టారు. అంటే-ఒక రకంగా తమ ఋణం తీర్చుకున్నారన్నమాట.

'నీ పెళ్ళి చేసేద్దాం అనుకుంటున్నారు నాన్న. నీకు ఎలాంటి వరుడు కావాలో యెంచుకో' అంది అమ్మ.

ముందు యీ ప్రశ్న అర్థం కాలేదు సుజాతకు. తను కొండమీది కోతి కావాలన్నా తీసుకువస్తారా ? ఎంత ధైర్యం! లేకపోతే—తను

కుటుంబ పరిస్థితులు ఆర్థిక వ్యవహారాలు బాగా తెలిసిన మనిషి కనుక తను సరయిన మనిషిని, సజావయిన సంబంధాన్ని ఎంచుకుంటుందనే భరోసానా? తండ్రి ఒకళ్ళు యిద్దరితో అనడంతను ప్రత్యక్షంగా విన్నది. 'మా సుజాత ఈ కాలపు ఆడపిల్లలాంటిది కాదు. కుటుంబ బాధ్యత, బరువు తెలిసిన మనిషి. ఇన్నేళ్ళుగా ఉద్యోగం చేసి అనుభవం సంపాదించింది. అమ్మాయికి ఇష్టమయిన మనిషినే వివాహం చేయాలని వుంది. అమ్మాయి మంచితనానికి యింతకంటే బహుమతి యింకేం యివ్వగలం?' అని.

తన మంచితనం రాణింపుకు వచ్చినందుకు సుజాత చాల సంతోషించింది. ప్రపంచంలో అనేకచోట్ల చూస్తున్నాము - మంచితనాన్ని అవతలివాళ్ళు 'ఎక్స్ప్లాయిట్' చేయడమే తప్ప యింత గుంభనంగా వాడుకోవడం కనిపించదు. పోతే - యెటువంటి వరుడు కావాలని తనను తను ప్రశ్న వేసుకున్నప్పుడు సుజాతకు ఠకీమని వెంటనే సమాధానం దొరకలేదు. డబ్బున్నవాడా ? అందమయినవాడా ? మంచి మనసున్నవాడా ? ఉద్యోగం వున్నవాడా? ఆ స్తిపాస్తులున్నవాడా ?...ఎటువంటివాడు కావాలి తనకు ?

జీవితాన్ని మనం శాసించుకుందాం అనుకోవడంకంటే ఎప్పటికప్పుడు జీవితం యెటువంటి అవకాశాలను కల్పిస్తే ఆ అవకాశాలను చక్కగా ఉపయోగించుకుని ముందుకు పోవడంలోనే యెంతో సమాధానం వున్నదని అనిపిస్తుంది సుజాతకు.

తల్లి తండ్రీ కేవలం తనమీదనే వదిలివేయలేదు. తమ ఎఱుకలో వున్న సంబంధాలు వాళ్ళు ప్రస్తావిస్తూ వస్తున్నారు. మంచి చెడ్డలను గురించి యోచన చేస్తూనే వున్నారు. ఒకళ్ళిద్దరు ప్రాస్పెక్టివ్ వరుళ్ళు వచ్చి సుజాతను చూచి వెళ్ళే అవకాశం కూడా కల్పించారు. వాళ్ళు యిష్టపడ్డ మాట నిజమేగాని-సుజాత ఆ కుర్రాళ్ళను ఆమోదించకపోవడంతో, ఇంక ఆ సంబంధాల విషయం మరచిపోయి ఇతర ప్రయత్నాలు ప్రారంభించారు.

ఆ సంబంధాలు తనకెందుకు అంతగా నచ్చలేదు—అని సుజాత ఆలోచించుకుంది. ఆ కుర్రవాళ్ళంటే తనకు ప్రత్యేకమయిన ఆకర్షణ ఏర్పడ లేదు. పెళ్ళికూడా ఏమాత్రం సృజనాత్మకమయిన ప్రసక్తి లేకుండా కేవలం ఆఫీసు రొటీన్‌లాగ యాంత్రికంగా తయారయితే ఏం బాగుంటుంది? తనను ఆకర్షించుకొని తన హృదయాన్ని అడిగి లాక్కోగల మనిషి కావాలి తనకు! అదీగాక ఆ యిద్దర్లో ఒకడు తను పెళ్ళి అయిన తరువాత కూడా ఉద్యోగం చేస్తూ వుండాల్సిందేగాని మానివేయటానికి యెంతమాత్రమూ వీలు లేదని ముందుగానే ఒక షరతు వేశాడు. భలే తమాషాగా అనిపించింది యీ షరతు సుజాతకు!

అవసరమయితే ఆడపిల్లలు ఉద్యోగాలు చేయవలసిందే అనే దయానిధిగారి సిద్ధాంతం (ఫిలాసఫీ) నుండి, తప్పకుండా చేయవలసిందే అనే నియమానికి వెంటనే దూకలేకపోయింది సుజాత. అతనూ ఏమీ వంటరివాడు కాదు. నలుగురున్న కుటుంబంలోంచి వచ్చినవాడే. మంచి ఉద్యోగంలోనే వున్నాడు. అయితేనేం - భార్య కూడా ఉద్యోగం చేసి, కుటుంబ ఆర్థిక వ్యవస్థకు తప్పనిసరిగా పాటుపడాలని అతని ఆలోచన! ఉద్యోగం అనేది మగవాళ్ళ దృష్టిలో అత్యవసరం. పెళ్ళయిన ఆడవాళ్ళకు వీలయితే చేయదగిన పని - సుజాత దృష్టిలో. అంతేగాని తప్పనిసరిగా చేయాలని ముందే షరతు వేసేవాడు - తీరా పెళ్ళి అయింతర్వాత ఇంక యెన్ని కొత్త కొత్త నియమాలు తీసుకువస్తాడో! సుజాత అందుకనే భయం వేసి యీ సంబంధం వద్దని ఖచ్చితంగా చెప్పేసింది. తరువాత తరువాత కాబోయే వరుళ్ళను పిలవడంలోనే కాస్త నికార్సయిన ఎంపిక ప్రారంభించింది.

వాళ్ళ ప్రయత్నాలన్నీ వృథా కాకముందే—చంద్రశేఖరం ఆమెను చూడటానికి వచ్చాడు. మనిషి గంభీరంగా దృఢంగా హుందాగా వుంటాడు. ప్లీడర్ పరీక్ష ప్యాసయి మూడేళ్ళుగా సీనియర్ దగ్గర పనిచేసి ఇప్పుడిప్పుడే

స్వంతంగా ప్రాక్టీస్ ప్రారంభం చేశాడు. మనిషి వెనకాల ఆస్తిపాస్తులు ఏమీ లేవుగాని, ఈ మనిషిలో ఎంతో ఆత్మస్థయిర్యం, విశ్వాసం కనిపించాయి సుజాతకు. జీవితం ఎలాగయినా గడవనీ - దాన్ని యీదుకొంటూ పోవటానికి ప్రయత్నం చేయవలసిందే, అన్న ధీమా కనిపించింది. సుజాత తల్లిదండ్రులకు కూడా యీ సంబంధం బాగా నచ్చింది. వాళ్ళ ప్రత్యేక కారణం ఏమిటంటే — ఉన్న వూళ్ళో సంబంధం, పిల్ల కళ్ల యెదురుగా వుంటుంది, యింతకంటే కావలసింది ఏమిటి ?

పెళ్ళి చూపులకు వచ్చినప్పుడు చంద్రశేఖరం సుజాతను అనేక ప్రశ్నలు వేశాడు. తననుకూడా ప్రశ్నలువేసి కావల్సిన సమాచారం అంతా సేకరించుకోమన్నాడు. అతని ధోరణి చాల స్పోర్టివ్‌గా అనిపించింది. సుజాతకు.

'మీరు బి.ఏ. ప్యాసయ్యారని తెలుసు. ఫలానా ఆఫీసులో స్టెనోగా పని చేస్తున్నారని కూడా విన్నాను. ఉద్యోగం మీకు యిష్టమేనా ?' అని అడిగాడు.

'ఇష్టమూ లేదు అయిష్టమూ లేదు. ఊరికే ఉండడం ఎందుకని చేస్తున్నాను.

'పెళ్ళి అయ్యాక ఉద్యోగం మానివేస్తారా?'

'మీ యిష్టం'- సుజాత ఇలా ఎందుకు సమాధానం చెప్పిందో ఆమెకే తెలీదు.

'నా ఇష్టం మాట అలా వుంచండి. మీ మనసుకు ఎలా తోస్తోందో చెప్పండి.'

'ఉహు, చెయ్యను.'

'ఏం, ఉద్యోగం ఇబ్బందిగా వుందా ?'

'అవును. టైమంతా పరుగెత్తడంతోనే సరిపోతోంది. హాయిగా కూర్చుందుకు, ఊపిరి పీల్చుకుందుకు లేదు—'

'పెళ్లయి సంసారం మీద పడినా అంతే-మనిషికి ఎప్పుడూ స్వేచ్ఛ లేదు.'

'అయినా ఆ వాతావరణం వేరు. నాది, నా స్వంతం అనే అభిప్రాయం వుంటుంది-ఇంట్లో. ఆఫీసులో అలా అనుకోవడం నాకు చేత కాదు-' అంది సుజాత.

అతను నవ్వి ఊరుకున్నాడు. ఇంకేం అనలేదు.

'చూడండి-నాకు కొన్ని దురలవాట్లు వున్నాయి. సిగరెట్లు తాగుతాను, సినీమాలు ఎక్కువగా చూస్తాను. తీరుబడి సమయం అంతా పుస్తకాలు చదవడంతోటే గడిపేస్తాను. నా ప్రాక్టీసు ఇంకా నిలదొక్కుకో లేదు, ప్రారంభ దశలోనే వుంది. కనీసం పదేళ్లపాటయినా కష్టపడాలి. బాగా కాంపిటేషన్ వున్న ప్రొఫెషన్!' అన్నాడు.

సుజాత విని ఊరుకుంది. ఏమీ ప్రశ్నలు వేయాలనిపించలేదు.

చంద్రశేఖరం సంప్రదింపుల సమయంలో 'నాకేం కట్నం అక్కర లేదు. ఏమన్నా ఇవ్వదలుచుకుంటే మీ అమ్మాయికి ఇచ్చుకోండి. నాకు అభ్యంతరం లేదు. వివాహం కూడా ఎంత సింపుల్‌గా చేతనయితే అంత సింపుల్‌గా చేయండి' అన్నాడు. ఇంకొకళ్ళయితే అతన్ని ఏమీచేత కానివాడి క్రింద జమకట్టేవాళ్లేగానీ సుజాతకు మాత్రం అలా అనిపించలేదు.

తనే స్వయంగా శుభలేఖలు పంచిపెట్టి ఆఫీసులోవాళ్ల నందరినీ ఆహ్వానించింది సుజాత.

'అదృష్టవంతురాలివి!' అన్నారు అందరూ. నిజంగా యీ అదృష్టం ఎలా వుంటుందో ముందు ముందు చూడాలి—అనుకుంది స్వగతంగా సుజాత.

దయానిధి ఇన్విటేషన్ కార్డ్ తీసుకుని- 'అయితే ఉద్యోగం మానేస్తా వన్నమాట!' అన్నాడు.

'అవునండీ! ఆలాగే అనుకొంటున్నాను'.

'నా మాట విను. అప్పుడే రాజీనామా యివ్వకు. ముందు కొద్దిగా సెలవు తీసుకో. సెలవు అయిపోయే లోపల ఏదో నిర్ణయించుకోవచ్చు-అంత తొందరపడి నిర్ణయించుకోవడం ఎందుకు? ఇంతకూ చంద్రశేఖరం అభిప్రాయం ఎలా వుందో!'

తరువాత తను రాజీనామా ఉత్తరం పంపించడంతోటే దయానిధి మళ్ళీ ఈ ప్రస్తావన తెచ్చాడు.

'నువ్వు తొందరపడుతున్నావు. నీ రాజీనామా నేను ఆమోదించడం లేదు.'

'మీ ఇష్టం. నేనుమటుకు ఆఫీసుకు రాను.'

'ఏం, ఇక్కడ ఈ ఆఫీసులో నీకు చెరసాలలో వున్నట్టుగా వుందా? నేనేం యముడుగా కనిపిస్తున్నానా? నానుంచి దూరంగా పారిపోవాలని యెందుకా తొందర?'

సుజాత నవ్వి వూరుకొంది. ఉత్తరం మటుకు ఉపసంహరించుకో లేదు.

వివాహం అయింతర్వాత సుజాత తిరిగి ఆఫీసు తొక్కలేదు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశానని చంద్రశేఖరంతో చెప్పింది. అతను ఏమీ మాట్లాడలేదు. నవ్వి వూరుకున్నాడు.

కొత్తగా కాపురం పెట్టింతర్వాత దయానిధి వచ్చాడు ఒకసారి చూడటానికి.

'ఏం చేస్తున్నావు, సుజాతా?' అన్నాడు, తను ఇచ్చిన కాఫీ కప్పు చేతిలోకి తీసుకొంటూ.

'ఇంకా ఏం రొటీన్ తయారుచేసుకోలేదు. ఇప్పుడు బోలెడంత టైం నాకు.'

'అదే! యీటైం అంతా ఏం చేస్తావు, ఎలా గడిపేస్తావు?'

'ఇంటి పనులు ఇంకా నాకు బాగా అవగాహన కాలేదు. అవి నేర్చుకోవడం—ఒక ఆర్డర్‌లో పెట్టుకోవడం కొంత టైం పడుతుందనుకుంటాను—' అంది, ఏం జవాబు చెప్పాలో స్ఫురించక.

'సరే, మీ యిద్దరేగా - యింటిపనులు ఏమంత పెద్దగా వుంటాయి. ఉదయం ఓ గంట, సాయంత్ర ఓ గంట చాలనుకుంటాను. తతిమ్మా టైమంతా ఏం చేస్తావు?'

—ఆయన యిలా గుచ్చిగుచ్చి అడగడం సుజాతకు చిరాకు అనిపించింది. కోపంగా సమాధానం చెప్పాలనిపిచింది. కాని పెద్దవాడు, ఎందుకు చిన్నబుచ్చుకుం అనే ఉద్దేశ్యంతో—ముఖంమీదికి నవ్వు తెచ్చుకుని యిలా అంది:

'స్నేహితురాళ్లకు ఉత్తరాలు రాస్తాను. నవలలు, కథలు, నాటకాలు చదువుతాను. ఇన్నాళ్ళూ కూపస్తమండూకంలా వున్నాను గదా, యిప్పుడు కాస్త ప్రపంచజ్ఞానం పోగు చేసుకుందుకు ప్రయత్నిస్తాను.... రేడియో వింటాను. సంగీతం నేర్చుకుంటాను, సినిమాలు చూస్తాను....' అంటూ ఒక్క బిగిని చేప్పేసింది.

ఈ సమాధానం దయానిధికి రుచించినట్లు లేదు ఆయన వాలకం చూస్తే—కాని యింకేం మాట్లాడకుండా సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు పుణ్యాత్ముడు....

ఎవరి అభిప్రాయాలు వాళ్లకు చాల రుచికరంగా వుంటాయి. అందుకు కారణం అవి తమ అభిప్రాయాలు అవడమే తప్ప యింకేం వుండదు—అనుకుంది సుజాత.

సుజాత మళ్ళీ టైం చూచుకుంది, తొమ్మిది గంటలయింది. అబ్బ! గంట సేపటినుంచి తను ఏం చేస్తున్నట్లు? ఊరికే గతాన్ని నెమరు వేసుకుంటూ బద్ధకంగా వుండిపోయిందా?

అబ్బబ్బ! మళ్ళీ పదిన్నర అయితే ఆయన యింట్లోకి వచ్చేస్తారు. కాస్త టిఫిన్ తయారు చేయాలి. మళ్ళీ కాఫీతాగి ఆయన కోర్టుకు వెళ్లి పోతారు. సుజాత గబ గబ దుప్పటి పక్కకునెట్టేసి మంచం దిగింది.

చంద్రశేఖరానిదంతా నియమబద్ధమయిన జీవితం. ఎనిమిది-ఎని మిదిన్నర అవడంతోటే తన స్వంత పనులన్నీ ముగించుకుని ముందు గది లోకి-ఆఫీసుగది అది-వెళ్ళిపోతాడు. రెండు గంటలసేపు ఈరోజు వున్న కోర్టు వ్యవహారం చూచుకోవడంతో సరిపోతుంది. గుమాస్తా, టైపిస్ట్ వచ్చి కావలసిన కాగితాలన్నీ సర్దుకుంటారు. క్లయింట్లువచ్చి మాట్లాడి వెడతారు. పదిన్నరదాకా యీ తతంగమంతా నడుస్తుంది. అప్పుడు కాస్త గట్టిగా టిఫిన్ తీసుకుని కోర్టుకు వెళ్ళిపోతారు. ఆ వెళ్లడం—తిరిగి రావడం ఒకటిన్నర-రెండు గంటలకే. ఎక్కువగా పని లేకపోతే ఒంటిగంటకే తిరిగి వచ్చేస్తాడు. అప్పుడు భోజనంచేసి—ఒకగంటసేపు విశ్రాంతి తీసు కుంటాడు. మళ్ళీ కోర్టుకు వెడతాడు. నాలుగున్నర అయిదుగంటలకు తిరిగి వస్తాడు. సాయంత్రం ఏమీ పని ఉండదు. ఇద్దరూ షికారుకో సినిమాకో వెడతారు. పనినిబట్టి, అవసరం అయితే టైపిస్ట్ రాత్రి ఎనిమిదింటికి వస్తాడు. అతనికో గంట, రెండు గంటలలో డిక్టేషన్ యివ్వడంతో సరిపోతుంది. ప్రతి రోజూ యేదో వొక కేసు తాలూకు అఫిడవిట్లో స్టేట్‌మెంట్లో వుంటాయి తయారు చేయాల్సినవి. ఈ పని అయింతర్వాత—మరునాటి కేసులు ఒక గంటసేపు స్టడీ చేసుకుంటాడు. పదిన్నర—పదకొండింటికి కాని పడుకోడు. దాదాపు ఒక ఆఫీసులాగ ఇలా నియమ బద్ధంగా పనిచేసుకోకపోతే-తెమ లదు-ఎప్పటిపని అప్పుడు చూచుకోకపోతే పార్టీలతో వేగడం కష్టం, వాళ్లను ఆకట్టుకోవడం కుదరదు. పార్టీల సహకారం లేకపోతే యీ వృత్తి జర గడం కష్టంకదా! ఒక్కోసారి క్లిష్టమైన కేసుల్లో పార్టీలతో రాత్రిపూటలు కూడా మాట్లాడవలసి వస్తూఉంటుంది. అర్ధరాత్రిదాకా సమాలోచనలు జర పాల్సి వస్తూ ఉంటుంది.

సుజాత వివాహ జీవితం ప్రారంభించి మూడు నెలలయిపోయింది. చంద్రశేఖరం ఆమెను ప్రాణ సమానంగా చూచుకుంటున్నాడు. అన్ని విషయాలలోను ఆమె అభిప్రాయాలకు విలువ ఇస్తాడు. ఇంటి యాజమాన్యం అంతా ఆమెకే వదిలేశాడు. ఆమె చేసే పనుల్లో ఏమయినా పొరపాటు వచ్చినా చూచీ చూడనట్లు వూరుకుంటాడు.

సుజాత ఎక్కువసేపు బద్ధకంగానే గడుపుతోంది. తనకు బోలెడంత కాల విరామం వుంది, కాలమంతా ఇప్పుడు తన చెప్పుచేతల్లోనే వుంది. దేనికి తాను తొందరపడి పరుగులు తీయాల్సిన అవసరం లేదు-అనే ఆలోచనలు ఆమెలో బాగా జీర్ణించుకు పోయినాయి. చంద్రశేఖరం కూడా మొదట్లో ఆమెను ఏమీ అనకపోవడంవల్ల-యీ ఆలోచనలు మరింతగా ఆమెలో స్థిరపడి పోయినాయి.

లేచి తిరిగినంతసేపూ ఉత్సాహంగా ఉంటుందిగాని—అసలు లేవటానికే బద్ధకం.

ఉదయం సరేసరి, ఎనిమిదిన్నర అయిన మీదటే లేవటం, ఏదో చకచక తన చేతిలోవున్న వస్తువులతో ఇంత టిఫినూ, కాఫీ తయారుచేసి ఆయన్ను పదిన్నర దాటకుండా కోర్టుకు వంపేయడం అవుతోంది. ఇప్పటి నుంచీ వంట చేసి పడేస్తే పదార్థాలన్నీ ఆయన వచ్చేసరికి చప్పగా చల్లారి పోతాయని—కాస్సేపు ఎలాగూ బద్ధకంగానే వుందిగదా అని కూర్చుండిపోయేది. ఏవేవో ఆలోచనలు మనసును ముంచేస్తూ వుండేవి. తీరా ఆ ఆలోచననుంచి తేరుకుని ఇవతల పడేసరికి పన్నెండు గంటలయి పోయేది. అప్పుడు ఆదరాబాదరా వంట ప్రయత్నం ప్రారంభం చేసి ఆయన వచ్చేసరికి ఎలాగో పూర్తి అయిందనిపించేది.

భోజనం చేసింతర్వాత—ఎలాగూ ఏమీ పనిలేదుగదా అని కాస్సేపు కునుకు తీయాలని చూచేది. ఈ కునుకునించి తేరుకునేటప్పటికి—

సాయంత్రం అయిపోయేది. చంద్రశేఖరం వచ్చి షికారుకు తీసుకువెళ్ళే వరకూ—అలాగే వుండిపోయేది.

మొదట్లో యేదో కొత్తగా దొరికిన విరామ సమయంలే అని చెప్పి-విశ్రాంతి తీసుకోవడం ఆరంభిస్తే—ఇదే ఓ సమస్యగా తయారయింది, రాను రాను.

రాత్రిపూట వంటచేయాలంటేనే బద్ధకం అనిపించేది. ఓ అరగంట, గంట అటూఇటూ తిరిగిరావడంవల్ల కొత్తగా బడలిక ఏర్పడేది.

క్రమంగా చంద్రశేఖరం ఓపిక కూడా పరిమితి ఏర్పడుతూ వచ్చింది మొదట్లో చూచి చూడనట్లు ఉండేవాడు కాస్త చిరాకు ప్రదర్శిస్తూ వస్తున్నాడు. అన్నీ సమయానికి అమరుతూఉంటే—ఉత్సాహంగా పనులు చేసుకుంటూ పోవచ్చును. తగినంత కారణం లేకుండా ఇలా ప్రతిదీ జాప్యం అవుతూవుండడం—ఆఖరుకు భోజనం విషయంలోనూ అశ్రద్ధ కనిపించడం అతనికి సహించరానిదయిపోయింది. ఎంత అణుచుకుందామన్నా—అసహనం పొగలు పొగలుగా బయటకు వస్తూంది.

ఈ స్తబ్దతకు కారణం ఏమిటో యెంత ఆలోచించినా సుజాతకూ తెలియకుండా పోతోంది. పోనీ పుట్టెడుపని చేసుకుని ఒక్కత్తే అవస్థపడుతోంది గనుక ఇటువంటి అలసట నీరసం వస్తున్నాయా అనుకుంటే—అసలు వున్నపనంతా ఎంత? దీనిలో మళ్ళీ తనకు సహాయం చేసే వాళ్లంటూ యిద్దరు పనిమనుషులు వుండనే వున్నారు!

తన బద్ధకంవల్ల—రానురాను ఇద్దరికీ వైమనస్యం ఏర్పడుతుందేమో నన్నభయం కూడా ఏర్పడసాగింది సుజాతకు.

సుజాతకు యెంతగా ఆలోచించినా ఇందుకు కారణం ఏమిటో తరుణోపాయం ఏమిటో స్ఫురించలేదు. తీరుబడి దొరికితే తను ఎన్నిపను

లయినా చేయాలనుకుంది. తీరుబడికోసం ఎంతగానో వెంపర్లాడింది. తన పనులు తాను చేసుకుంటూ తతిమ్మా సమయంలో హాయిగా విశ్రాంతి తీసుకుంటూ ఏ నవలో-కథో చదవడమో-రేడియో వినడమో - ఉత్తరాలు రాసుకోవడమే చేద్దామనుకుంది. కాని కనీసం-స్నేహితురాళ్ళ ఉత్తరా లకు జవాబు రాయడమయినా కుదరకుండా పోతూవుంది. ఇదివరకే నయం. అంత ఆఫీసు పనిలోనూ ఓ పది-పదిహేను నిమిషాలు దొంగి లించి తన ఫ్రెండ్సుకు 'ఉభయ కుశలోపరి' ఉత్తరాలు రాస్తూవుండేది. ఏదైనా మాగజైన్లూ, నవలలూ చదువుకుంటూ వుండేది. ఇప్పుడు అటు వంటి పని ఏమీ చేయకపోగా యిలా బద్ధకం పెరిగిపోయి, తనో సోమరి పోతులాగ తయారయిపోతోంది.

లాభంలేదు. తను యిలాగే వుండిపోయేట్లయితే తన వంటికీ యింటికీ కూడా మంచిదికాదు. తను యేదో చేసితీరాలి. తన బుర్ర పూర్తిగా 'డెవిల్స్ వర్క్‌షాప్' కాకముందే - దానికేదో పని నియమించాలి. ఎప్పుడూ పైస ముఖమే చూడని పసికుర్రాడికి ఏకంగా రూపాయి కాగితం అందిస్తే ఎలా ఉక్కిరిబిక్కిరి అయిపోతాడో అయోమయంలో పడిపోయి వెంపర్లాడు తాడో - అలా వుంది తన పరిస్థితి యిప్పుడు!

ఈ విషయాన్ని గురించి వేరుగా చంద్రశేఖరంతో సంప్రదించడమే బుద్ధికి లక్షణంగా తోచింది, సుజాతకు.

'యేమండీ. నాకేమీ తోచడంలేదు. ఉట్టి సోమరిపోతుగా తయారయి పోతున్నాను.'

'మంచిదేగా!' అన్నాడతను నవ్వుతూ.

'అలాకాదు. సీరియస్‌గా మాట్లాడుతున్నాను నేను. నాలో యేదో లోపం వుంది. చెప్పండి—''

'నీలో లోపాలు నాకేం కనిపించడం లేదు.'

'అలాకాదు - ఇదివరకు బోలెడంత పని చేయగలిగేదాన్ని. నిమిషం విరామం యెరగకుండా బంతిలా తిరుగుతూ వుండేదాన్ని. ఆ చురుకుదనం, చలాకీదనం యిప్పుడు యేమయిపోయినాయో నాకు తెలియడం లేదు. ఉత్త మన్నుదిన్న పాములాగ తయారవుతున్నాను.'

'బహుశ యిప్పుడు అంత చురుకుదనం అక్కర్లేదేమో'

'పోతే పోనీయండి. మన్నుదిన్న పాములాగ తయారయి పోతు న్నానుగదా!' - అంది సుజాత యింకా కుంగిపోతూ.

'అయితే యేం చేస్తానంటావు?'

'అదే నాకు అర్థంగాక కొట్టుకుంటున్నాను. ఎన్నో పనులు చేయా లనుకుంటాను. కాని ఒక్కటి చేయలేకపోతున్నాను.'

'అనాసక్తయోగం!'

'మీరలా వేళాకోళంచేస్తే నాకు నిజంగా కోపం వస్తుంది' అంది సుజాత ఋంగమూతిపెట్టి.

చంద్రశేఖరం ఆమెను మరింత దగ్గరగా లాక్కుని ప్రగాఢంగా ముద్దుపెట్టుకుని 'యేమీ బేజారుపడకు డియర్. నాలుగు రోజులు యిలాగే వుంటుంది. తరవాత అంతా సర్దుకు పోతుంది. ఊరికే ఖంగారుపడి-లేని పోని సమస్యలు వెదికి తెచ్చుకోకు—' అన్నాడు.

ఆ సంభాషణ అంతటితో సమసిపోయినా సుజాత మనస్సు మాత్రం యీ విషయంలో యెటువంటి రాజీకి రాలేకపోయింది.

సుజాత తనలో తానే ఆలోచించుకోసాగింది. పూర్వాపరాలు చర్చిం చుకో సాగింది. తను యెందు కిట్లా తయారయింది ?

ఆమె యిలా బాధపడుతున్న రోజుల్లోనే దయానిధి వాళ్ళను చూడ టానికి వచ్చాడు. సుజాతను చూచి ఆశ్చర్యపోయాడు అతను.

'అదేమిటమ్మా! అలా చిక్కిపోయావు?' అన్నాడు నిర్ఘాంతపోయి.

'ఈ మాటే నేనంటే ఏమీ లేదని కొట్టిపారేసింది సుజాత! ఇప్పుడు మీరూ యిదే అంటున్నారు' అన్నాడు చంద్రశేఖర్ ముసిముసిగా నవ్వుతూ.

'ఏమీ పనిలేక చిక్కిపోతున్నానండి! సోమరితనంతో లావెక్కటానికి బదులు నీరసించిపోతున్నాను' అంది సుజాత.

'నేను ముందే చెప్పాను, సుజాతా! ఇంత తీరుబాటు నీ వంటికి పడదు. ఎప్పుడూ పనిలో నిమగ్నమయి—నియమబద్ధంగా నిమిషాలు గడిపి వేయటానికి అలవాటు పడ్డావు. యేడేళ్ళ సర్వీసులోను. ఇప్పుడు ఊరికే కూచుంటే అవుతుందా?'

—సుజాతకు తన పరిస్థితికి 'క్లూ' దొరికినట్లయింది. పైకి మాత్రం యేమీ తేలకుండా యేవో కులాసా కబుర్లు చెప్పడంలో మునిగిపోయింది. దయానిధి వెళ్ళిపోతూ 'నువ్వు మళ్ళీ పనిలో చేరాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు. మంచిరోజు చూచుకుని వచ్చేసేయి' అన్నాడు.

అతని మాటలకు ముగ్గురూ నవ్వుకున్నారు.

ఆరోజు రాత్రి సుజాతను దగ్గరకు తీసుకుంటూ చంద్రశేఖరం — 'ఏం రేపట్నించి ఆఫీసుకు వెడతావా?' అన్నాడు.

'ఆఁ!'

'నిజం?'

'వెడతాను, కాని, ఆ ఆఫీసుకు కాదు. లాయర్ చంద్రశేఖరంగారి ఆఫీసులో స్టెనోను నేను. ఆయనకు పర్సనల్ సెక్రటరీ పని కూడా నాదే! లాయర్‌గారి ఎప్పాయింట్‌మెంట్స్ డైరీ, ఎంగేజ్‌మెంట్స్ డైరీ, కోర్టు డైరీ - యివన్నీ అప్ టు డేట్‌గా వుంచేపని నాదే! రేపట్నుంచి టైపిస్టును రానక్కర్లేదని చెప్పండి. టైపు పనంతా నా చేతిమీదుగానే చేస్తాను.!'

'ఎందుకు సుజాతా! లేనిపోని బెడద పెట్టుకుంటావు నువ్వు!'

'కాదులెండి. నేను ఒక్క నిమిషమూ విరామంగా వుండకుండా చేతి నిండా పని కావాలి నాకు. నేను చేయగల పనిలో పదోవంతయినా చెయ్యకపోవడంవల్లనే నాకీ సోమరితనం వచ్చింది.'

'నీ యిష్టం.'

'కాని, ఓ మనవి! ఈ సెక్రటరీ తప్పులు చేస్తేమటుకు మీరు క్షమించగూడదు. నెత్తిమీద మొట్టితేగాని మీ సెక్రటరీకి మతి సరిగ్గా వుండదు' అంది సుజాత.

ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు. *

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)